ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
బుధవారం | 15 జులై, 2026 | పేజీలు :08

# అభివృద్ధి పనులు సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలి



జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ప్రొజెక్టర్ ద్వారా పనుల పురోగతిని పరిశీలించి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టరేట్ నుంచి డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులతో మంజూరైన గ్రామీణ అభివృద్ధి పనులన్నింటినీ ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు,ఇతర ప్రభుత్వ భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడైనా క్రిటికల్ గ్యాప్స్ ఉన్నట్లయితే వెంటనే గుర్తించి సంబంధిత ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.అంగన్‌వాడీ భవనాల మరమ్మత్తు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, చిన్నారులకు సురక్షితమైన,

తరువాయి 2లో...

**ప్రజాపక్షం/కరీంనగర్ :** గ్రామీణ ప్రాంత ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించే జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం కల్పించే జేఎన్‌వీఎస్‌టీ–2027 పరీక్షకు జిల్లాలోని అర్హత కలిగిన ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసి పరీక్ష రాసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. జవహర్ నవోదయ విద్యాలయం, చొప్పదండిలో 2027–28 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే ఎంపిక పరీక్ష ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో అడిషనల్ కలెక్టర్ మంగళవారం సాయంత్రం తన ఛాంబర్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న సుమారు 11 వేల మంది విద్యార్థులు ఉన్నారని, వారందరూ ఈ ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామస్థాయి సిబ్బంది

తరువాయి 2లో

# నవోదయ లక్ష్యం... ప్రతి విద్యార్థికీ అవకాశం



కరీంనగర్ జిల్లాలోని 11 వేల మంది ఐదో తరగతి విద్యార్థులందరూ ప్రవేశ పరీక్ష రాయాలి

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సమీక్ష




## పరిశుభ్రమైన పట్టణంగా

# తీర్చిదిద్దడమే లక్ష్యం

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల పట్టణాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్య పట్టణముగా తీర్చి దిద్దడమే ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ అధ్యక్షతన జూలై మాసానికి సంబంధించిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో భాగంగా జగిత్యాల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వార్డుల వారీగా నిర్వహించిన స్వచ్ఛ భారత్ అవగాహన సదస్సులకు దేశస్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమని తెలిపారు. పాలకవర్గ సభ్యులు,అధికారులు,ప్రజాప్రతినిధులు అందరూ పార్టీలకు అతీతంగా సమిష్టిగా పనిచేస్తూ జగిత్యాలను పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలో మెరుగైన మౌలిక వసతుల కల్పనతో సమగ్ర అభివృద్ధి సాధించడమే తమ లక్ష్యమని తెలిపారు. రూ. 6 కోట్ల 13 లక్షల అంచనా వ్యయంతో జగిత్యాల పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణంలోని అన్ని వార్డులు, నూతన హౌసింగ్ కాలనీలలో రోడ్లపై గుంతలు పూడ్చడం, వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జేసీబీల

తరువాయి 2లో..

# స్నేహితుడే హంతకుడు




వివరాలు వెల్లడించిన ఏఎస్పీ

# తాగునీరు వృథా చేస్తే జరిమానా

కలెక్టర్ ఇలా త్రిపాఠి



## పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా డ్రైన్లు, కాలువలను శుభ్రపరచడం, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను పూర్తిస్థాయిలో ప్రజల వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. అనంతరం జాతీయ జల మిషన్ కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ సభ్యులందరూ జల ప్రతిజ్ఞ చేశారు. ప్రతి నీటిని ఒడిసి పట్టి రాష్ట్రంలోనే జగిత్యాలను ఇంకుడు గుంతల నిర్మాణంలో జగిత్యాలను అగ్రగామిగా నిలుపుదామని కమిషనర్, వార్డు సభ్యులందరూ సహకరించాలని కోరారు. వార్డు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ సత్య ప్రణవ్, తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనులు సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

మెరుగైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** మున్సిపల్ పరిధిలోని నాలుగో వార్డు గంగాపురిలో కోతుల బెడద రోజురోజుకూ మితిమీరిపోతోంది. మంగళవారం మధ్యాహ్నం తాటి సత్యమ్మ అనే వృద్ధురాలిపై కోతులు గుంపుగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గత నెల రోజులుగా గ్రామంలో కోతుల దాడులు విపరీతంగా పెరిగిపోయాయి. ఇప్పటికే తాటి శాంతమ్మ, బుర్ర దేవయ్యలతో పాటు పద్మశాలి వీధి, ఎస్సీ వీధుల్లోని పలువురు వృద్ధులు ఈ కోతుల దాడికి గురయ్యారు. కోతులు ముఖ్యంగా వృద్ధులనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీటి దాడి నుండి తప్పించుకునే క్రమంలో వృద్ధులు కిందపడి కాళ్లు, చేతులు విరగ్గొట్టుకుని నరకయాతన అనుభవిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

**అధికారులు, యువత స్పందించాలి :** వరుసగా జరుగుతున్న ఈ దాడులపై మున్సిపల్ అధికారులు, అధికార పార్టీ నాయకులు తక్షణమే స్పందించి కోతుల బెడద నుండి తమను కాపాడాలని బాధితులు కోరుతున్నారు. అలాగే గంగాపురి గ్రామ యువత కూడా బాధ్యతగా ముందుకు రావాలని, గ్రామ ప్రజల రక్షణ కోసం అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందని స్థానికులు పిలుపునిచ్చారు.

# నవోదయ లక్ష్యం... ప్రతి విద్యార్థికీ అవకాశం

(మొదటిపేజీ తరువాయి)

సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించి ఒక్క అర్హ విద్యార్థి కూడా ఈ అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. అధికారిక వెబ్‌సైట్: https://navodaya.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నవోదయ విద్యాలయాలు దేశంలోనే అత్యుత్తమ నివాస పాఠశాలలుగా గుర్తింపు పొందాయని, ఇక్కడ 100 శాతం ఉచిత విద్య, ఉచిత వసతి, భోజన సౌకర్యం, సీబీఎస్ఈ సిలబస్, త్రిభాషా విధానం, ఆధునిక బోధన, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఒత్తిడి లేని విద్యా వాతావరణం, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు ఇది జీవితాన్ని మలిచే అరుదైన అవకాశమని పేర్కొన్నారు. జేఎన్‌వీఎస్‌టీ–2027కు ఆన్‌లైన్ దరఖాస్తులు జూలై 2 నుంచి ప్రారంభమయ్యాయి. జూలై 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబర్ 28, 2026న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. 2026–27 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. విద్యార్థి చదువుతున్న జిల్లా, నివాస జిల్లా ఒకటే అయి ఉండాలి. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, జెడ్పీ సీఈవో పవన్ కుమార్, డీపీఓ జగదీశ్వర్, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అయాజ్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపల్ కమిషనర్లు కిషన్, మల్లికార్జున్, నాగరాజు,చొప్పదండి నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా ఇంకుడు గుంత

### మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, మెట్‌పల్లిలో మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం, భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి పునర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాల మట్టం పెరుగుతుందని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించడం, వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి చేరేలా చర్యలు తీసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ మాట్లాడుతూ, విద్యార్థులు నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించుకొని తమ కుటుంబ సభ్యులకు కూడా ఇంకుడు గుంతల నిర్మాణంపై చైతన్యం కల్పించాలని సూచించారు. భూగర్భ జలాల పరిరక్షణలో విద్యార్థులే మార్పుకు దూతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంకుడు గుంతల ప్రాముఖ్యతపై చిత్రలేఖన (డ్రాయింగ్) పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నీటి సంరక్షణపై తమ ఆలోచనలను చిత్రాల రూపంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# టార్గెట్ కోసం ప్రభుత్వ ధనం వృథా

### డబుల్ రోడ్డు వస్తుందని తెలిసినా రోడ్డు పక్కనే చెట్లు నాటుతున్నారు

**ప్రజాపక్షం/గన్నేరువరం :** డబుల్ రోడ్డు వస్తుందని తెలిసి కూడా రోడ్డు వేసే స్థలంలోనే చెట్ల మొక్కలను నాటుతున్నారని గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు మంజూరై మూడేళ్లు గడుస్తున్నా కేవలం గుండ్లపల్లి నుంచి గునుకుల కొండాపూర్ వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. చేసిన పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను నిలిపివేశాడు. దీంతో ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేస్తూ డబుల్ రోడ్డు భవిష్యత్‌లో వేస్తారో వేయరో అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. రోడ్డు వచ్చే వరకు చూద్దాంలే అన్నట్లుగా గ్రామ కార్యదర్శులు తమ టార్గెట్ కోసం రోడ్డు పక్కనే చెట్ల మొక్కలు నాటిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి సమయం, ప్రజాధనం వృథా అవుతాయని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ ప్రణాళికలు సరిగ్గా లేకపోవడం వల్ల ఇలా జరుగుతుందని భవిష్యత్‌లో ఈ చెట్లను నరికి వేయాల్సి వస్తుందని ప్రజలు మండిపడుతున్నారు. రోడ్డును ఎంతవరకు వెడల్పు చేస్తారో ముందుగానే గుర్తించి ఆ పక్కన మొక్కలను నాటాలని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



# నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు

**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్ర ప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చి ఉద్యోగ, కార్మిక వర్గానికి వ్యతిరేకమైన ఆ నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసేంతవరకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని కరీంనగర్‌లో గణేష్ నగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ జరిగిన ఏఐటియుసి జిల్లా సమితి ఐదవ మహాసభలో పలు తీర్మానాలు చేసినట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, టి.సమ్మయ్యలు తెలిపారు. భవిష్యత్తులో అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పైన, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జిల్లాలో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయాలని, కార్మికులందరికీ ప్రమాద బీమా సౌకర్యం, పెన్షన్ సౌకర్యం, కనీస వేతనాలు అమలు చేయాలని తదితర డిమాండ్స్ తో భవిష్యత్తులో పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని మహాసభలో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అనంతరం జిల్లా నూతన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షునిగా కాసేట్టి లక్ష్మయ్య, జిల్లా అధ్యక్షునిగా కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్, ఉపాధ్యక్షులుగా జంగా తిరుపతి యాదవ్ ,బెజ్జంకి కాళిదాస్, కిమ్మసారపు శ్రీనివాస్, వెల్దండి దామోదర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య, సహాయక కార్యదర్శులుగా పిట్టల సమ్మయ్య, డి.రజిత, పిట్టల శ్రీనివాస్, కే.రజిత, కడారి బీరయ్య, కోశాధికారిగా చిట్ల నిఖిల్‌తోపాటు జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులుగా, 20 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు.







## కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, రామగుండం సిపి

**ప్రజాపక్షం/ పెద్దపల్లి :** సింగరేణి భరోసా యాత్రలో పాల్గొనేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి జిల్లాకు విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని మంగళవారం ఆర్జీ 1 పరిధిలోని ఓసీపీ 5 వద్ద జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష, రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.


## సివిల్ సప్లై హమాలీ కార్మికులకు లారీ మామూలు పెంచండి

### ఎఐటియుసి డిస్ట్రిక్ జనరల్ సెక్రటరీ కడారి సునీల్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సివిల్ సప్లై హమాలీ కార్మికులకు గత కొన్ని సంవత్సరాల నుండి లారీ అన్‌లోడింగ్, లోడింగ్ లారీ మామూలు పెంచకుండా సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నాడని ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ అన్నారు. మంగళవారం రోజున సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారంకై సంబంధిత డీఎంతో చర్చించడం జరిగిందని అన్నారు. డిఎం తన పరిధిలో ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అదే విధంగా పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో సివిల్ సప్లై గోదాం నిర్మాణానికి స్థల సేకరణ కు సంబంధిత జిల్లా కలెక్టర్, తహసిల్దార్ సహకరించాలని స్థలం కేటాయించి ప్రభుత్వ సొంత గోదాం నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.గట్టయ్య, ఉపాధ్యక్షులు ఏం కుమార్, కార్యదర్శి ఎం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని వేగంగా పెంచాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని వేగంగా పెంచడంతో పాటు నీటి లభ్యతకు అనుగుణంగా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, పంటల ప్రణాళికపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలు ప్రస్తుతం దిగుబడులు ఇవ్వడం ప్రారంభించాయని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరుగుతుండటంతో ఇతర రైతుల్లో కూడా ఈ పంటపై ఆసక్తి పెరుగుతోందన్నారు. గత 45 రోజుల్లోనే సుమారు 300 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాట్లు పూర్తయ్యాయని, రైతుల ఆసక్తి మరింత పెరిగిన నేపథ్యంలో చిన్నపాటి ప్రోత్సాహం కల్పిస్తే జిల్లాకు నిర్దేశించిన 1,100 ఎకరాల లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని తెలిపారు.ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వచ్చే 20 రోజుల్లో కనీసం 15 ఎకరాలను ఆయిల్ పామ్ సాగుకు మార్చేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి క్లస్టర్‌లో ఈ నెలాఖరులోగా కనీసం 15 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాట్లు పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో తిరుమల ఆయిల్ కంపెనీ సీఈవో కళ్యాణ్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ ఉద్యానవన శాఖ అధికారి శ్యాం ప్రసాద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## గుంత తవ్వారు.. మరమ్మతులు మరిచారు

ప్రజాపక్షం/జగిత్యాల : జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసినగర్‌లింగంపేట ప్రధాన రహదారిపై మంచి నీటి పంపు లీకేజీ అయ్యింది.అయితే మున్సిపల్ అధికారుల ఆదేశాలు మేరకు సిబ్బంది మరమ్మత్తు చేపట్టేందుకు గుంతను తవ్వడంతో ప్రమాదకరంగా మారింది. తక్షణమే గుంతను పూడ్చి మరమ్మత్తులు చేపట్టాలని తులసినగర్ ప్రజలు ప్రభుత్వాన్ని, అధికారులను కోరుతున్నారు.

## నమస్తే డే – సఫాయి కార్మికులకు పిపిఇ కిట్ల పంపిణీ

ప్రజాపక్షం/కోరుట్ల : కోరుట్ల మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం నమస్తే డే వేడుకలను నిర్వహించారు. పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల భద్రత, గౌరవమే ధ్యేయంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా కార్మికులకు వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత, వైస్ చైర్‌పర్సన్ మహమ్మద్ షాహెద్ ఉల్ అహద్, మున్సిపల్ కమిషనర్ వి.రాఘవేంద్ర మరియు స్థానిక వార్డు ప్రతినిధులు హాజరై,కార్మికులకు స్వయంగా రక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి తిరుమల వసంత మరియు మున్సిపల్ కమిషనర్ వి.రాఘవేంద్ర మాట్లాడుతూ.. స్వచ్ఛ కోరుట్ల నిర్మాణంలో అహర్నిశలు శ్రమిస్తున్న సఫాయి కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్మికులకు సమాజంలో సముచిత గౌరవం, భద్రత కల్పించడమే నమస్తే డే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మైలారపు లింబాద్రి, మైలారపు రాంబాబుకు ఘన సన్మానం

ప్రజాపక్షం/మెట్‌పల్లి : స్వయంభు వరసిద్ధి వినాయక ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం, కాణిపాకం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మైలారపు లింబాద్రి, అలాగే ఆర్యవైశ్య మహాసభ యువజన రాష్ట్ర అదనపు కార్యదర్శిగా ఎన్నికైన మైలారపు రాంబాబులను జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊటూరు నవీన్ మాట్లాడుతూ, మైలారపు లింబాద్రి, మైలారపు రాంబాబు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలకు ఎన్నిక కావడం ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణమని అన్నారు. వారు తమ పదవుల ద్వారా సమాజ అభ్యున్నతికి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంటాల శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్ రాజు, జగిత్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొని నూతన బాధ్యతలు చేపట్టిన మైలారపు లింబాద్రి, మైలారపు రాంబాబును ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# సిఎం రేవంత్ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ ఫిర్యాదు



ప్రజాపక్షం/మల్లాపూర్: సి.ఎం హోదాలో రైతులపై బిఆర్ఎస్ నాయకుల పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కేసు నమోదు చేయాలంటూ మండల బిఆర్ఎస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్లో మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాలు లేక రైతులు అల్లాడిపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడుతుండడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించేలా అవకాశాలున్నప్పటికీ నీరందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలపట్ల వివక్ష చూపుతోందని , రైతుల పక్షాన టిఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంటలపై రక్తం చల్లని అంటూ చేసిన వ్యాఖ్యలకు తమ రక్తాన్ని సైతం ఇవ్వడానికి సిద్ధమంటూ మాట్లాడారు. కాళేశ్వరం నీటితో రైతులకు సాగునీరు తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతకుముందు ఏఎస్ఐ ప్రకాష్ కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గౌరు నగేష్, బండి లింగస్వామి, చింతల రమేష్, సతీష్, రఫిక్,లక్ష్మణ్ రాజు,రాజన్న,బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# రామలింగేశ్వర దేవాలయ చైర్మన్‌గా చుంచు నరేందర్



ప్రజా పక్షం/బీర్పూర్ : జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలంలోని మంగేళ గ్రామంలోని ప్రముఖ దేవస్థానం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం మరియు ఇతర దేవాలయాల అభివృద్ధి, నిర్వహణ కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగించేందుకు నూతన దేవాలయ కమిటీని గ్రామ పంచాయతీ సర్పంచ్ బనుక సతీష్ ,ఉపసర్పంచ్ దగ్గుల వీరేశం ,వార్డు సభ్యులు మరియు గ్రామ నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.నూతన కమిటీచైర్మన్ గా చుంచు నరేందర్‌వైస్ చైర్మన్లు గుర్రం శ్రీనివాస్, గురునాథం నరేష్‌ప్రధాన కార్యదర్శి దుంపేట మల్లేశంకోశాధికారి బనుక నగేష్‌సలహాదారులు రాస శంకర్, నారపాక శంకర్‌ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు సర్పంచ్ బనుక సతీష్ ,ఉపసర్పంచ్ దగ్గుల వీరేశం మరియు గ్రామ పెద్దలు శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేవాలయాల అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో నూతన కమిటీ సమిష్టిగా కృషి చేసి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు తమపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, గ్రామ ప్రజల సహకారంతో దేవాలయాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని తెలిపారు. గ్రామ పాలక వర్గం, గ్రామ పెద్దలు మరియు వి విధ కులపెద్దలు నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# మంత్రి చొరవతో అర్చకుల జీతాలు పెంపు



ప్రజాపక్షం/ధర్మపురి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న 8 మంది అర్చకులు,అభిషేక పురోహితుల వేతనాలను పెంచుతూ మంగళవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ల సమక్షంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఎం.హన్మంతరావు సంబంధిత ఆర్డర్ కాపీలను అందజేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు నుండి ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న వీరికి కేవలం 8 వేల వేతనం మాత్రమే ఉండగా జీతాలు పెంచాలని కోరుతూ ఇటీవల రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ కు వారు విన్నవించారు. తక్షణం స్పందించిన మంత్రి లక్ష్మణ్ కుమార్ సంబంధిత శాఖామంత్రి, అధికారులతో మాట్లాడారు.ఈ క్రమంలో ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు,పురోహితులు, పాచక, ప్రసాద వితరణ సిబ్బందికి 8 వేల నుండి 30 వేలు వరకు వేతనాలు పెంచుతూ కమిషనర్ హన్మంతరావు పత్రాలు అందించారు.ఈ సందర్భంగా వారు మంత్రి అడ్లూరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజగౌడ్,ఆర్డీవో మధుసూదన్,గ్రంథాలయ చైర్మన్ దినేష్,దేవస్థానం మాజీ అధ్యక్షులు జక్కు రవీందర్,ఈఓ శ్రీనివాస్,సూపరిండెంట్ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవలకు ప్రజల్లో విశేష ఆదరణ



ప్రజాపక్షం /మల్లాపూర్ : మల్లాపూర్ శ్రీ కనక సోమేశ్వర లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం సిరిపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ముఖ్య అతిథి హాజరై క్లబ్ చైర్మన్ రేవెల్లి తిరుపతి తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం సమీప గ్రామాల నుండి శిబిరానికి హాజరైన వారికి రేకుర్తి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు.అదేవిధంగా ఆపరేషన్ అవసరమయ్యే వారిని రేకుర్తి కంటి ఆసుపత్రికి బస్సు సౌకర్యం కల్పించి ఉచితంగా తరలించారు.మండల వ్యాప్తంగా ప్రజలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవలందిస్తున్న చైర్మన్ ,సభ్యులను నర్సింగారావు అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంట సౌజన్య శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి,లయన్స్ క్లబ్ చైర్మన్ రేవెల్లి తిరుపతి, కార్యదర్శి డాక్టర్ మండస్వామి, కోశాధికారి కల్లెం నాగిరెడ్డి, మెట్పల్లి క్లబ్ చైర్మన్ శ్రీనివాసరావు,నాయకులు గడ్డం లక్పతి రెడ్డి,మాధవరెడ్డి,శ్రీధర్ రెడ్డి,తదితరులు ఉన్నారు.

## జిల్లా ఆటో–టాటా మ్యాజిక్ యూనియన్ న్యాయ సలహాదారుగా అడ్వకేట్ మన్నే గంగాధర్

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి జేఏసీ ఆటో–టాటా మ్యాజిక్ మూడు మండలాల అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి పాత బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద జిల్లా ఆటో–టాటా మ్యాజిక్ జీపు అసోసియేషన్ యూనియన్ న్యాయ సలహాదారుగా (అడ్వకేట్) నియమితులైన అడ్వకేట్ మన్నే గంగాధర్ను ఘనంగా సన్మానించారు. ఇటీవల జిల్లా ఆటో–టాటా మ్యాజిక్ జీపు అసోసియేషన్ యూనియన్ తరఫున న్యాయ సలహాదారుగా అడ్వకేట్ మన్నే గంగాధర్‌ను నియమించగా, ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శివలాల్ నాయక్, జిల్లా కార్యదర్శి రంగు సంపత్ గౌడ్‌తోపాటు యూనియన్ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, డ్రైవర్లు, యూనియన్ సభ్యులకు ఎదురయ్యే న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి అడ్వకేట్ మన్నే గంగాధర్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. జిల్లా యూనియన్ తరఫున ఆయనను న్యాయ సలహాదారుగా ఎంపిక చేశామని, భవిష్యత్తులో ఆయన సూచనలు, సలహాల మేరకు యూనియన్ కార్యకలాపాలను కొనసాగిస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు శివలాల్ నాయక్, జిల్లా కార్యదర్శి రంగు సంపత్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, జేఏసీ మూడు మండలాల అధ్యక్షుడు గుడిసెల గంగాధర్, గుట్టన్న, మామిడి గంగాధర్, ఆటో–టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ధర్మపురి సిఐ, ఎస్సైలకు ప్రశంసాపత్రాలు

ప్రజాపక్షం/ధర్మపురి : విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరిచిన ధర్మపురి సీఐ ఎలపాటి రాం నర్సింహారెడ్డి, ఎస్సైలు గురుక మహేష్,మిర్యాల రవీందర్,సిబ్బంది లను మంగళవారం జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,డిఎస్పీ పురుషోత్తం రెడ్డిలు అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందజేశారు. మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా 1000 మందికి పైగా విద్యార్థులతో విస్తృత స్థాయిలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సీఐ రాం నర్సింహారెడ్డికి పత్రాన్ని అందించి అభినందించారు.అలాగే చోరీ జరిగిన 24 గంటల్లోనే కేసును ఛేదించి పూర్తి సొత్తును రికవరీ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్సై మహేష్ ను అదేవిధంగా మరో కేసులో అంతర్ రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన నిందితుడిని పట్టుకునేందుకు ఒడిశా వెళ్లి సమన్వయంతో చర్యలు చేపట్టి నిందితుడ ని పట్టుకుని తీసుకువచ్చిన ఎస్సై 2 మిర్యాల రవీందర్ ను ఎస్పీ అభినందించారు. ఆయా కేసుల్లో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బంది పి.రణధీర్,కె.కిరణ్,సంజీవ్,ఆరిఫ్ లకు ఎస్పీ ప్రశంసా పత్రాలు అందించారు. ఎస్పీ అశోక్ కుమార్ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రతీ పౌరుడూ సహకరించాలని తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికులకు పిపిఇ కిట్ల పంపిణీ

ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఆధ్వర్యంలో మంగళవారం నమస్తే డే సెలబ్రేషన్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ పరిశుభ్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని వారికి పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (PPE) కిట్లను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికులు ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి భద్రత, సంక్షేమం కోసం పురపాలక సంఘం నిరంతరం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్, పురపాలక సంఘం అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంరక్షణ బాధ్యత ప్రతీ పౌరుడిది

ప్రజాపక్షం/ధర్మపురి : భవిష్యత్ తరాలకు నీటి భద్రతను కల్పించేందుకు ప్రతీ పౌరుడు బాధ్యతతో వ్యవహరించి నీటి సంరక్షణలో భాగస్వామి కావాలని ధర్మపురి మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జల్ సంచయ్ జన భగీదారీ 3.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం పురపాలక సంఘం కార్యాలయం,ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామంటూ ప్రతిజ్ఞ చేసారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి ,గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్,నాయకులు వేముల రాజేష్,మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్,సానిటరీ ఇన్స్పెక్టర్ చిట్యాల గంగాధర్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేకు ప్రజలు, రైతులు సహకరించాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం భూ రీసర్వే కార్యక్రమాన్ని దశలవారీగా అమలు చేస్తోందని ,భూ రీసర్వే కార్యక్రమానికి ప్రజలు,రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో తొలి విడతలో ధర్మారం మండలం పైడిచింతలపల్లి, పెద్దపల్లి మండలం నిమ్మన్ పల్లి, సుల్తానాబాద్ మండలం రెబ్బల్‌దేవ్‌పల్లి, రామగిరి మండలం పన్నూర్, మంథని మండలం మల్లాపల్లి గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమం ప్రారంభమై కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో గ్రామ సరిహద్దుల నిర్ధారణ పనులు పూర్తవగా,గ్రామకంఠం సర్వే పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే జూలై 15 నుంచి అంతర్గాం మండలం సోమనపల్లి,ఎలిగేడు మండలం లోకపేట, పెద్దపల్లి మండలం రంగంపల్లి, పాలకుర్తి మండలం గూడిపల్లి, శ్రీరాంపూర్ మండలం మంగపేట, ఓదెల మండలం గూడెం, మంథని మండలం అంగులూరు, ముత్తారం (మంథని) మండలం శుక్రవారంపేట గ్రామాల్లో భూ రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ గ్రామాల్లో జూలై 14న గ్రామసభలు నిర్వహించి ప్రజలకు కార్యక్రమంపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.ప్రతి గ్రామంలో రీసర్వే చేపట్టే ముందు గ్రామసభ నిర్వహించి, భూ యజమానులకు కార్యక్రమం ఉద్దేశ్యం, విధివిధానాలను వివరించిన అనంతరమే సర్వే చేపడుతున్నామని కలెక్టర్ తెలిపారు. సర్వే అండ్ బౌండరీస్ చట్టం–1923 నిబంధనల ప్రకారం రీసర్వే ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.భూ రీసర్వే కార్యక్రమం విజయవంతం కావడానికి సంబంధిత గ్రామాల ప్రజలు, రైతులు గ్రామసభలకు హాజరై అధికారులు,సర్వేయర్లు, లైసెన్స్‌డ్ సర్వేయర్లకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## కూరగాయల పంటలతో రైతులకు అధిక లాభాలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి మండలం లోని బందంపల్లి, అప్పన్నపేట శివార్లలోని కూరగాయ తోటలను మండల ఉద్యాన విస్తరణ అధికారి బి. రాము పరిశీలించారు. ముఖ్యంగా రైతులు పంట మార్పిడి చేపట్టాలని వరి, పత్తి, మొక్కజొన్న పంటలకి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్లు, పామాయిల్ తోటల సాగు చేపట్టాలని ఉద్యాన విస్తరణ అధికారి బి. రాము అన్నారు.ఈ మేరకు పంట మార్పిడి విధానం ప్రత్యామ్నాయ పంటల సాగు పై రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు.పంట మార్పి డి తో రైతులకు ఆదాయ మార్గాలు ఏర్పడతాయని, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బోర్ల కింద బావుల కింద డ్రిప్ తో ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు, పామాయిల్ తోటలు సాగు చేయాలన్నారు.కూరగాయల నారు టమాట, మిర్చి, వంకాయ 100% సబ్సిడీతో ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూరగాయల సాగులో మేలైన మల్చింగ్ పద్ధతిలో సాగు చేయాలన్నారు.పాలం శ్రీనివాస్, దామోదరి శ్రీనివాస్ , సంపత్, రైతులు ,కూరగాయల రైతులు పాల్గొన్నారు.

## హోటళ్లపై ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ అంకిత్ పలు హోటళ్ళు,తినుబండారాల దుకాణాల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సోదాల్లో భాగంగా హోటళ్లలోని వంటగదులను,నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించారు.ఆహార తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై,కల్తీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ప్రజల ఆరోగ్యంతో ఆటలాడితే సహించేది లేదని,ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని హోటల్ నిర్వాహకులకు స్పష్టం చేశారు.

## బిందు సేద్యం వైపు రైతులు మొగ్గు చూపాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** బిందు సేద్యం ద్వారా నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని మైదంబండ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శశిధర్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా ముత్తా రం మండలం లోని మైదంబండ గ్రామానికి చెందిన పందుల సంజీవ్ అనే రైతు తన పొలంలో బిందు సేద్యం పద్ధతిని అవలంబిస్తూ కాకర సాగు చేస్తున్నారు.ఈ పంటను ఏఈఓ శశిధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిందు సేద్యం వైపు రైతులు మొగ్గు చూపాలని,సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా ఆధునిక సాంకేతికతను వాడుకుంటూ సాగు చేయడం వల్ల పెట్టుబడి ఖర్చులు తగ్గడమే కాకుండా,ప్రతి నీటి చుక్కను మొక్కకు ఉపయోగపడేలా చేయవచ్చని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి బిందు సేద్య విధానాలు రైతులకు ఎంతో లాభదాయకమని,ఇతర రైతులు కూడా ఈ పద్ధతులను అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ పరిశీలనలో రైతుతో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం



**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గుర్తింపు సంఘం అయినటువంటి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) ప్రతినిధులతో బుధవారం జిఎం కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు లతో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి యం.రామచంద్రారెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో బి.ఎస్4, బి.ఎస్6 యంత్రాల ఇంజన్ల కోసం స్కాన్ టూల్ (పరికరము) కొనుగోలు చేయడం, ఓసిపి1 సైట్ ఆఫీస్ నుండి సైలో బంకర్ వరకు ఫెన్సింగ్ అలాగే సిహెచ్పి చెక్ పోస్ట్ సైట్ ఆఫీస్ వరకు రోడ్డును నిర్మించడం, షావల్, డ్రిల్ యంత్రాల పరికరాలను అందుబాటులో ఉంచడం, గనిలో డ్రిల్ బిట్లను అందుబాటులో ఉంచడం, కే5, కే6 యంత్రాలకు బుషెస్, బేరింగ్స్, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచడం, టాటా హిటాచి షావల్‌కు సింగ్ లాక్ అమర్చడం, సెంటినరీ కాలనీలోని జోన్ 2 క్వార్టర్లకి పడమర నుండి ఒక రోడ్డు వేయడం, పబ్లిక్ హియరింగ్‌లో అలాట్ అయిన ఓపెన్ జిమ్ము లను వివిధ ప్రదేశాలలో అమర్చడం, తెలంగాణ చౌరస్తాలో మరుగుదొడ్లను నిర్మించడం,సెంటినరీ కాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో దసరా ఉత్సవాలను కంపెనీ నిర్వహించాలని, పబ్లిక్ పార్క్ లో పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలను అమర్చడం, అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ లోని సర్ఫేస్ ఫ్యాన్ చుట్టూ ఫెన్సింగ్ వేయడం,ఆపరేటర్ కు రూమ్ ఏర్పాటు చేయడం, సర్ఫేస్ సబ్ స్టేషన్ ఫిల్టర్ బెడ్ ఫ్యాన్ కు సెక్యూరిటీ గార్డ్ ను ఏర్పాటు చేయడం,లాంటి పది అంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో స్ట్రక్చరల్ కమిటీ సభ్యులు జూపాక రామ్ చందర్, డి.తిరుపతి రావు, విజయ రాఘవ, బి.క్రాంతి కుమార్, ఏరియా ఎస్వోటుజిఎంలు రామ్మోహన్, బండి సత్య నారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు జె.రాజశేఖర్, ప్రవీణ్ విఫ్యాటింగ్, సిహెచ్పి డిజియం కాశీ విశ్వేశ్వరరావు, సివిల్ డిజియం బి.రాజేంద్ర కుమార్,పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ప్రాజెక్ట్ ఇంజనీర్లు జ్ఞాన సంబందన్,ప్రకాష్,సెక్యూరిటీ ఆఫీసర్ షబ్బీరుద్దీన్, డివై పిఎం వంశీ దర్,ఐఈ ప్రవీణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ఈశ్వరమ్మపై చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ప్రజాపక్షం/జమ్మికుంట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియమితులైన బీసీ బిడ్డ పోచబోయిన ఈశ్వరమ్మపై యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఉప సర్పంచుల ఫోరం జమ్మికుంట మండల అధ్యక్షుడు దొంతరవేన రమేశ్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ బీసీ మహిళను అవమానించేలా మాట్లాడడం సిగ్గుచేటని బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా అవసరమైతే జక్కిడి శివచరణ్ రెడ్డి ఇంటిని ముట్టడించి నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. బీసీ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే ఏలాంటి వ్యాఖ్యానైనా సహించబోమని బీసీ సమాజం ఐక్యంగా తగిన సమాధానం ఇస్తుందని హెచ్చరించారు.

# సర్పంచులపై సర్కార్ సవతి తల్లి ప్రేమ



**ప్రజాపక్షం / రామడుగు :** తెలంగాణ ప్రభుత్వం సర్పంచ్ లపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు మోడి రవీందర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు సరఫరా చేసే బావుల కరెంటు బిల్లులు, వీధి దీపాల బిల్లులు గ్రామ పంచాయతీలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారుల ద్వారా ఆదేశాలు జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధికి ఇప్పటి వరకు నయా పైసా మంజూరు చేయని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ పన్నుల రూపంలో వసూలైన ఆదాయమును రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు నింపుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రంలోని సర్పంచులు అందరూ కలిసి మూకుమ్మడిగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సర్పంచులు ఎవరు కూడా ప్రభుత్వానికి బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. 99 ప్రణాళిక పేరుతో ప్రభుత్వం ఆర్భాటం చేస్తుంది తప్ప అభివృద్ధికి 99 రూపాయలు కూడా మంజూరు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నలు నార్లు పోసి నాటు కోసం ఎదురు చూస్తున్నారని రైతుల సంక్షేమం కోసం కాళేశ్వరం నీటిని వెంటనే వరద కాలువకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పోచంపల్లి నరేష్, బండ తిరుపతి రెడ్డి, జితేందర్, దయ్యాల వీరమల్లు, వేముండ్ల కుమార్, కమలాకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు స్వల్పకాలిక పంటలు సాగు చేయాలి

**ప్రజాపక్షం/గంగాధర :** ఎల్నినో ప్రభావం వల్ల ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని రైతులు స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణాధికారి వెంకట్ తెలిపారు. మంగళవారం గంగాధర మండలం కురిక్యాల గ్రామంలోని రైతు వేదికలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వరి సాగును నీటి పారుదల సౌకర్యం పూర్తిగా ఉన్న భూముల్లో మాత్రమే చేపట్టాలని సూచించారు. నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయం పంటల వైపు మళ్లాలని కోరారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు కంది, అలసంద, ఉలవలు వంటి పంటలు వేసుకోవడానికి అనువుగు ఉందని ఆగస్టు 16 నుంచి 31 లోపు నువ్వులు, ఇతర పప్పు ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు వంటి తక్కువ కాలపరిమితి గల పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఇవ నీటి అవసరం తక్కువగా ఉండి తక్కువ సమయంలో పంట చేతికి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వాతావరణ మార్పులను అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం వల్ల నష్టాలను తగ్గించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన జెండావిష్కరణ



**ప్రజాపక్షం/రామడుగు:** మండలంలోని గోపాలరావుపేట్ గ్రామంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ సీనియర్ నాయకులు సీపెల్లి వెంకటేశ్ ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ హాజరై టిఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ కవితక్క నాయకత్వంలో ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతే రాజు నియమకాలు, సామాజిక తెలంగాణనే లక్ష్యంగా పాంచజన్య పథకాన్ని ఏర్పాటు చేశారని అన్నారు. తెలంగాణ రక్షణ సేన పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే సబ్బండ వర్గాలకు సమన్యాయం జరిగుతుందని అన్నారు. ఈనెల 20న రామగుండంలోని సింగరేణి కార్మికుల కోసం కవితక్క తలపెట్టే నిరాహార దీక్షలో తెలంగాణ రక్షణ సేన సైనికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయలన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ ఇంచార్జ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, సీనియర్ నాయకులు గుండేటి తిరుపతి, పిట్టల సత్యం, గాలిపెల్లి రత్నాకర చారి, బీసీ విభాగం అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, సీనియర్ నాయకులు బుడిగే పరశురాం గౌ, బాసవేణి రాజేందర్ రవి శంకర్ బాబు, రాజు, శ్రీకాంత్, రవి, శంకరయ్య, స్వామి, మధు, తిరుపతి, శేఖర్ రాజు, రాజుమల్లయ్య, సుధాకర్, మధు మహిళా విభాగం నాయకురాలు ద్వావ శారదలు పాల్గొన్నారు.

## తెలంగాణలో రాబోయేది బిజెపి సర్కారే

**ప్రజాపక్షం/మానకొండూర్ :** తెలంగాణలో రాబోయేది బిజెపి సర్కారేనని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ కళ్యాణ మండపంలో మండల అధ్యక్షులు కంది రాజిరెడ్డి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరచారి హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలు, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలు, శక్తి కేంద్రాలు, బూత్ కమిటీల బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాట కార్యచరణ తదితర అంశాలపై వారు సమగ్రంగా వివరించారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు కార్యకర్త సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు రాపాక ప్రవీణ్, ఓబిసి రాష్ట్ర కార్యదర్శి అడిచెర్ల రాజు, ఓబీసీ రాష్ట్ర నాయకులు అప్పని తిరుపతి, ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి మియపురం లక్ష్మణాచారి, ప్రధాన కారయదర్శులు శీలం కుమార్, భాషబోయిన ప్రదీప్, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఆవుదారి విజయ, మండల మోర్చాల అధ్యక్షులు, మండల పదాధికారులు, శక్తి కేంద్రాల ఇంచార్జీలు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

సబ్బని రాజేంద్రప్రసాద్

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** వామపక్ష పార్టీ విద్యార్థి సంఘాల నాయకులు చేపట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం అర్ధరాత్రి నుండి అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని నాయకులు హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో మంగళవారం అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా నాయకులు మాట్లాడారు. విద్యార్థుల త్యాగాల వల్లే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, ఈరోజు విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న నాయకులపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లలో పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యపడుతుందని విమర్శించారు.ఈ అక్రమ అరెస్టులలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, ప్రోగెసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ తో పాటు పలువురు ఉన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**ప్రజాపక్షం /కౌటాల :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బిఆర్ఎస్ నాయకులు మంగళవారం కౌటాల పోలీస్ స్టేషన్‌లో లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ పిలుపు మేరకు ఈ ఫిర్యాదు అందజేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ప్రతిపక్ష నేతలు, రైతులను అవమానించేలా ఉండటంతో పాటు హింస, ఆత్మహత్యలకు ప్రేరేపించేలా ఉన్నాయని ఫిర్యాదులో ఆరోపించారు. భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వెంటనే ప్రథమ సమాచార నివేదిక నమోదు చేయాలని పోలీసులను కోరారు. ప్రతిపక్ష నేతలు, వారి కుటుంబ సభ్యులు, రైతులకు తగిన రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కన్వీనర్ నాగపూరే బండు పటేల్, మహిళా కన్వీనర్ దుర్గం మమత, గుండాయిపేట్ సర్పంచ్ సంతోష్, ఉపసర్పంచ్ సాయినాథ్, చారి గోవింద్ రావు, డొబ్బల మంగేష్, సృజన్ పాల్గొన్నారు.

## జాతీయ బాక్సింగ్ కోచ్‌గా మంథని సందీప్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** శ్రీరాంపూర్ ప్రాంతంలోని కృష్ణకాలనీకి చెందిన మంథని విజయ, పోచం దంపతుల కుమారుడు మంథని సందీప్ పంజాబ్‌లోని పటియాలలో నిర్వహించిన అఖిల భారత నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ బాక్సింగ్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికై శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. కోచ్ సర్టిఫికెట్‌ను మంచి గ్రేడ్‌తో సాధించి స్వస్థలానికి చేరుకున్న సందీప్‌కు ఆయన కోచ్ జగత్ సాయి, మంచిర్యాల జిల్లా బాక్సింగ్ సంఘం సభ్యులు, సీనియర్ క్రీడాకారులు ఘనంగా అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సందీప్ భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బాక్సింగ్ అసోసియేషన్ తరపున ఆయనకు ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు యుగేందర్ సాయి, సుంధిళ్ల నరేష్, కండె తిరుపతి, గసిగంటి సాగర్ పాల్గొన్నారు.

# బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** సింగరేణి భవిష్యత్తు కోసం మరిన్ని బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని, 12వ వేతన ఒప్పంద కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని ఏఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి భరోసా యాత్రలో భాగంగా శ్రీరాంపూర్ ప్రాంతానికి మంగళవారం విచ్చేసిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రెండు కీలక అంశాలపై సమగ్ర వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య మాట్లాడుతూ సింగరేణి సంస్థకు తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సమయంలో సంస్థ దీర్ఘకాలిక అభివృద్ధి, దేశ ఇంధన భద్రత దృష్ట్యా కోయగూడెం బ్లాక్-3, సత్తుపల్లి బ్లాక్-3, మణుగూరు డీప్ సైడ్, చెన్నూర్ సౌత్, వెంకటాపూర్-2, చిట్యాగూడా, వెంకటాపూర్, శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను కూడా నామినేషన్ పద్ధతిలో సింగరేణి సంస్థకే కేటాయించాలని కోరారు. గతంలో వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు కేటాయించిన కోయగూడెం బ్లాక్-3, సత్తుపల్లి బ్లాక్-3లలో ఇప్పటివరకు తవ్వకాలు ప్రారంభం కానందున, వాటిని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కు అప్పగించాలన్నారు. దేశవ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందం గడువు 2026 జూన్ 30తో ముగిసినందున, జూలై 1 నుండి అమలులోకి రావాల్సిన 12వ వేతన ఒప్పందానికి ఇప్పటివరకు కమిటీని ఏర్పాటు చేయకపోవడం కార్మికులలో ఆందోళనకు కారణమవుతోందని తెలిపారు. 12వ వేతన ఒప్పందాన్ని నూతన లేబర్ కోడ్‌లతో ముడిపెట్టకుండా పాత విధానంలోనే స్వతంత్రంగా చర్చించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థను బలోపేతం చేయడం, కార్మికుల ఉపాధి భద్రతను కాపాడడం దేశ ప్రయోజనాలకు అత్యంత అవసరమని, కేంద్ర ప్రభుత్వం దీనిపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ ఎస్‌కె. బాజీ సైదా, వైస్ ప్రెసిడెంట్ కొట్టే కిషన్ రావు, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఆఫీస్ బేరర్స్, గనుల ఫిట్ సెక్రటరీలు, నాయకులు పాల్గొన్నారు.

# వామపక్ష నాయకుల ముందస్తు అరెస్టు




**ప్రజాపక్షం / వాంకిడి :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన చలో సచివాలయం కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా పలువురు వామపక్ష నాయకులను అరెస్ట్ చేశారు. సోమవారం రాత్రి సమయంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా మార్క్సిస్ట్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా, సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ నాయకులను అదుపులోకి తీసుకుని వాంకిడి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా అరెస్టైన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్, సిపిఐ జిల్లా నాయకులు బోయిరే ప్రకాష్, సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి గోగ్గర్ల తిరుపతి మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన సుమారు ఐదు వందల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధులు విడుదల కాకపోవడంతో విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి నేరుగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనివల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రి లేకపోవడంతో విద్యావ్యవస్థ గాడితప్పుతోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని మండిపడ్డారు. ఈ అక్రమ అరెస్టులలో సిపిఎం జిల్లా నాయకులు జాడి తిరుపతి, డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తీక్, సిపిఐ నాయకుడు రాకేష్ ఉన్నారు.

# ఎల్ 1 ఇండ్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలి

కలెక్టర్ కె. హరిత

**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎల్ 1 జాబితాలో ఉన్న కచ్చా ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు, గెజిటెడ్ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి, లబ్ధిదారుల జాబితా పరిశీలనపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత కొరకు ఎల్ 1 జాబితాలో గల కచ్చా ఇండ్ల లబ్ధిదారుల వద్దకు వెళ్లి వాస్తవ పరిస్థితులపై విచారణ జరిపి నివేదికలు వెంటనే అందించాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎల్ 1 జాబితాలో కచ్చా ఇండ్లుగా నమోదైన ఇండ్ల వివరాల సంఖ్య 2 వేల 300 గా ఉందని, అందులో ఇప్పటి వరకు 1 వేయి 800 ఇండ్ల పరిశీలన పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 500 ఇండ్లు పరిశీలించాల్సి ఉందని తెలిపారు. గెజిటెడ్ అధికారులు ఇండ్ల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని, మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి సాధించాలని పేర్కొన్నారు. మొదటి విడతలో 9 వేల 306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, ఇప్పటివరకు 683 ఇండ్లు పూర్తి చేశారని, మిగతా ఇండ్లు వివిధ దశలలో ఉన్నాయని వివరించారు. గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇండ్లు పూర్తి చేసే విధంగా



చర్యలు తీసుకోవాలని, బిల్లులు లబ్ధిదారులకు అందేలా చూడాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రకాష్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గెజిటెడ్ అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ గుండా మల్లేష్ జయంతి

మిట్టపల్లి వెంకటస్వామి

**ప్రజాపక్షం /బెల్లంపల్లి:** భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ కమ్యూనిస్టు పక్ష మాజీ నాయకులు, దళిత హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు కామ్రేడ్ గుండా మల్లేష్ 79వ జయంతి వేడుకలను బెల్లంపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలిచిన మహోన్నత నాయకుడు గుండా మల్లేష్ అని కొనియాడారు. ప్రాజెక్టులు, విద్యాలయాల నిర్మాణం కోసం తపించారన్నారు. దున్నేవానికే భూమి దక్కాలని పోరాడిన ప్రజానేత అని, లాకప్ మరణాలు, జంట హత్యలకు వ్యతిరేకంగా, పౌర హక్కుల రక్షణ కోసం నిరంతరం శ్రమించిన కమ్యూనిస్టు ఉద్యమ ధీరుడని ఆయన స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు బి. పూర్ణిమ, బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి మల్లేష్, సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, జిల్లా సమితి సభ్యులు బొల్లం తిలక్, అంబేద్కర్, అక్కపెల్లి బాపు, జెసి మాణిక్యం, డిఆర్ శ్రీధర్, గుండ సరోజక్క, రత్నం రాజం, కొండుబానేష్, నాయకులు బొంకూర్ రామచందర్, బందారి శంకర్, కామెడి దుర్గయ్య, స్వామిదాస్, గుండ ప్రశాంత్, గుండా శంకర్, మహేందర్ రెడ్డి, ఇనుముల రాయమల్లు, మహిళా సమైక్య నాయకురాళ్లు బొల్లం సోనీ, స్వర్ణలత పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న జన్నారం పోలీసులు

**ప్రజాపక్షం / జన్నారం :** మూర్ఛపోయి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడటంతో పాటు అతని వద్ద ఉన్న లక్షా ఎనిమిది వేల రూపాయల నగదును సురక్షితంగా అప్పగించి జన్నారం పోలీసులు నిజాయితీ, మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం రాత్రి సమయంలో ఒక వ్యక్తికి మూర్ఛ వచ్చి నోటి నుంచి నురుగు వస్తుండగా బ్లూ కోల్ట్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ దేవన్న, హోంగార్డు నీలయ్య గమనించి వెంటనే ఎస్ఐ జి. ఉదయ్ కిరణ్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంటనే స్పందించి ప్రైవేట్ అంబులెన్స్ ఏర్పాటు చేసి బాధితుడిని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాధితుడు పడిఉన్న ప్రాంతాన్ని పరిశీలించగా అతని వద్ద ఉన్న కవర్ లో ఒక లక్షా ఎనిమిది వేల రూపాయల నగదు లభించింది. రాత్రి వేళల్లో ఎవరూ తమ వెంట పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

**ప్రజాపక్షం /కౌటాల :** సిర్పూర్ నియోజకవర్గంలో మాజీ ఎంఎల్ఏ కోనేరు కోనప్ప నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ కౌటాల మండలానికి చెందిన కాంగ్రెస్, బిజెపి పార్టీల పలువురు ముఖ్య నాయకులు, అనుచరులు వందలాది మంది మంగళవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కోనేరు కోనప్ప మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు, గౌరవం, బాధ్యతలు కల్పిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ కోనేరు కోనప్ప నాయకత్వంలో సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నుంచి గురుడపేటకు చెందిన మేకల తిరుపతి, కోయగూడకు చెందిన తలండి హనుమంతు, బిజెపి సోషల్ మీడియా కన్వీనర్ రాంచందర్, తుమ్మిడి హెట్టికి చెందిన నగపురేకు బండు, గిరవెల్లికి చెందిన ఎల్ములే మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నుంచి కనికి మాజీ సర్పంచ్ ఎడ్ల వెంకటేష్, శీర్ష గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి భీమయ్య అనుచరులు, తాటిపల్లికి చెందిన ఆరుగురు వార్డు సభ్యులు, ఐదుగురు కార్యకర్తలు, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సాయి భోజన్ అన్నదానం

**ప్రజాపక్షం / బెల్లంపల్లి :** ఆషాఢ అమావాస్యను పురస్కరించుకొని బెల్లంపల్లి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం మధ్యాహ్నం గర్భిణులు, బాలింతలు, డయాలసిస్ రోగులు, అన్నార్తులకు సాయి భోజన్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు, ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్, రాజేశ్వరిల సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్, రాజేశ్వరి మాట్లాడుతూ ఆకలితో ఉన్నవారిని అతిథి సత్కారంతో ఆదరిద్దాం, అన్నదానంతో తృప్తి పరుద్దాం అని పిలుపునిచ్చారు. సేవే లక్ష్యం, సేవే మార్గంతో ట్రస్ట్ కొనసాగుతుందని, మానవ సేవే మాధవ సేవ అని త్రివిధ్య, శ్రవిధ్య, త్రయాక్షర్ పేర్కొన్నారు.

## నిర్మల్ ఎటిడిఒ అంబాజీకి డిటిడిఒగా పదోన్నతి

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ (ఐటీడీఏ) కార్యాలయంలో అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఎటిడిఒ)గా విధులు నిర్వహిస్తున్న జె. అంబాజీ పదోన్నతి పొందారు. ఆయనకు జిల్లా ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (టిడిడిఒ)గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన ఆయన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా డీటీడీఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈ సందర్భంగా నిర్మల్ డీటీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయనను ఘనంగా అభినందించారు. నిర్మల్ జిల్లాలో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ, నూతన బాధ్యతల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ ఏసీఎంఓ (ఎసిఎంఒ) ఆర్. శివాజీ, జూనియర్ అసిస్టెంట్లు కె. అనిల్ కుమార్, శ్రీమతి వనిత, డి.పి.ఓ. రాజు (రాహుల్ రాథోడ్), డేటా ఎంట్రీ ఆపరేటర్ ఎ. రాజేష్, ఆఫీస్ సబార్డినేట్లు సౌజన్య, శ్రీకాంత్ తదితర డీటీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొని అంబాజీకి శుభాకాంక్షలు తెలిపారు.

## క్యాచ్ ది రైన్‌పై అవగాహన

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** కేంద్ర జనశక్తి మంత్రిత్వ శాఖ, తెలంగాణ ప్రభుత్వం సీడీఎంఎ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 'జలశక్తి అభియాన్ జనభాగీ దారి' జెఎస్‌జెబి 3.0 లో భాగంగా 'క్యాచ్ ది రైన్' అవగాహ కార్యక్రమంను మున్సిపల్ కమిషనర్ గజానంద్ ఆధ్వర్యంలో నిర్వహించి విద్యార్థులతో కలిసి నీటి సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేసి మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఇంటి వద్ద ఇంకుడు గుంతలను నిర్మించి భూగర్భజలాలను పెంచటంలో తమ వంతు సాయమందించాలని కోరారు. నీరు ప్రాణాధారమని, నీటిని వృధా చేయకుండా సంరక్షించటంతో భవిష్యత్తును రక్షించవచ్చని అదేవిధంగా పట్టణంలో నూతనంగా గృహాలు నిర్మిస్తున్న వారు నిర్మించుకున్న వారుతప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుని నీటి సంరక్షణలో పాలుపంచుకోవాలని కోరారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ మేనేజర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై ప్రకటనలు

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కన్నె సురేందర్ మాట్లాడుతూ 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి రూ.3 కోట్ల బిల్లు ముందుగానే విడుదలైనట్లు తెలిపారు. అలాగే 4 కోట్ల పెండింగ్ బిల్లులు కూడా సంబంధిత శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహతో అలాగే ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్కకు మాట్లాడితే సానుకూలంగా స్పందించి త్వరితగతిన ఆ బిల్లులు విడుదల చేస్తామని హామీనివ్వటం జరిగిందని తెలిపారు. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి ఇదివరకే 8 కోట్ల వరకు వెచ్చించటమే కాకుండా సుందరీకరణ పనులు కోసం మంజూరైన రూ.15 కోట్లకు టెండర్ల ప్రక్రియ పూర్తవటమే కాకుండా పనులు కూడా త్వరలోనే మొదలవుతాయన్నారు. సర్పంచ్‌లు సమీర్, జనార్దన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బద్దం అవినాష్, గోపాల్‌నాయక సుంకరి సురేష్, మేకల శ్రీనివాస్, మహేష్, శ్యామ్, మనోజ్, మురారి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# స్నేహితుడే హంతకుడు

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలో తేదీ 1107 2026 న మధ్యాహ్నం సుమారు 12:30 గంటలకు, భైంసా పట్టణంలోని ఆటోనగర్ చౌటా బ్రిడ్జి సమీపంలోని మురికి కాలువలో గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి భైంసా ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు మృతదేహం ఫోటోలను ప్రచారం చేయగా, ఫిర్యాదు దారు మక్బూల్ అహ్మద్ వచ్చి మృతుడు తన కుమారుడు నసీర్ అహ్మద్ అని గుర్తించారు.మృతుడి శరీరంపై గాయాలు ఉండటంతో తన కుమారుడి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా, ఆ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించబడింది.దర్యాప్తులో భాగంగా మృతుడి బంధువులు, స్నేహితులను విచారించడం,పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను విస్తృతంగా సేకరించి విశ్లేషించడం, సెల్‌ఫోన్ కాల్ డేటా రికార్డులు (CDR) మరియు ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించడం ద్వారా మృతుడు చివరిసారిగా తన స్నేహితుడు మొహమ్మద్ సఫ్రాన్ అహ్మద్‌తో కలిసి ఉన్నట్లు గుర్తించారు. దర్యాప్తులో సేకరించిన శాస్త్రీయ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు సాక్షుల వాంగ్మూలాల ప్రకారం, గతంలో జరిగిన డబ్బుల వివాదం కారణంగా గ్యారేజీలో ఇద్దరి మధ్య గొడవ జరగగా, నిందితుడు మొహమ్మద్ సఫ్రాన్ అహ్మద్ అక్కడ ఉన్న రెండు సుత్తులతో నసీర్ అహ్మద్ తలపై పలుమార్లు దాడి చేసి హత్య చేసినట్లు తేలింది.అనంతరం నేరాన్ని దాచిపెట్టే ఉద్దేశంతో మృతదేహాన్ని ఒక ఐరన్/CO మెషిన్ బాక్స్లో ఉంచి, మృతుడి మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లి ఆటోనగర్ చౌటా బ్రిడ్జి సమీపంలోని మురికి కాలువలో పడవేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో, 13072026 న నిందితుడు మొహమ్మద్ సఫ్రాన్ అహ్మద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, దర్యాప్తులో సేకరించిన ఆధారాల ఆధారంగా నేరంలో అతని ప్రమేయం నిర్ధారించబడింది.స్వాధీనం చేసుకున్న వస్తువులు మృతుడి మోటార్ సైకిల్.మృతుడి మొబైల్ ఫోన్.హత్యకు ఉపయోగించిన రెండు సుత్తులు మృతదేహాన్ని తరలించేందుకు ఉపయోగించిన ఐరన్/సిఒ మెషిన్ బాక్స్.కేసుకు సంబంధించిన ఇతర భౌతిక, శాస్త్రీయ సాంకేతిక ఆధారాలు.దర్యాప్తు విశేషాలు:దర్యాప్తులో భాగంగా నేరస్థలానికి సంబంధించిన అన్ని ప్రవేశ నిష్క్రమణ ( మార్గాలను పూర్తిగా పరిశీలించడం జరిగింది.అనుమానితులను విచారించడం జరిగింది. అలాగే, నేరస్థలానికి సమీపంలోని అన్ని సీసీటీవీ ఫుటేజీలను సేకరించి క్షుణ్ణంగా విశ్లేషించడం జరిగింది. దర్యాప్తులో సేకరించిన సీసీటీవీ ఫుటేజీలు, డిజిటల్ ఆధారాలు మరియు ఇతర సాంకేతిక సాక్ష్యాలన్నింటినీ చట్టపరమైన సాక్ష్యాలుగా కేసు విచారణ సమయంలో గౌరవ న్యాయస్థానంలో సమర్పించబడతాయి.శాస్త్రీయ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక సాక్ష్యాలు క్షుణ్ణమైన దర్యాప్తు ఆధారంగా ఈ కేసును స్వల్ప వ్యవధిలోనే ఛేదించడం జరిగింది.ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ, భైంసా ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, భైంసా టౌన్ మీడియా సమావేశంలో వెల్లడించారు.కేసుకు సంబంధించిన తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

# తాగునీ వృథా చేస్తే జరిమానా

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎక్కడ కూడా తాగునీరు వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎవరైనా తాగునీటిని వృధా చేస్తే జరిమానాలు విధించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ పట్టణ ప్రాంతాల్లో రూ. 10 వేలు, గ్రామపంచాయతీల పరిధిలో రూ.5 వేల జరిమానా విధించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం తాగునీటి సరఫరా, సాగునీటి లభ్యత, భూగర్భజలాల పెంపుదల తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రధాన జలాశయాలైన నిజాంసాగర్, శ్రీరాంసాగర్ రిజర్వాయర్లలో అందుబాటులోని నీటి నిల్వలు, తాగు, సాగునీటి అవసరాలకు అవి ఏమేరకు సరిపోతాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలున్నందున, అందుబాటులోని నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వినియోగించుకోవల్సిన అవసరముందన్నారు. ప్రత్యేకించి తాగునీటిని ఏమాత్రం వృధా చేయకుండా భవన నిర్మాణాలు వంటి ఇతర అవసరాలకు మళ్లించకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ చేయాలన్నారు. ఎక్కడైనా తాగునీటిని వృధా చేస్తే, బాధ్యులకు జరిమానాలు విధించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అన్ని నివాస ప్రాంతాలకు, ప్రజల అవసరాలకు సరిపడా రక్షిత మంచినీరు సరఫరా జరిగేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు అన్ని నివాస ప్రాంతాలలో తాగునీటి సరఫరా స్థితిగతులను పరిశీలించి సంయుక్తంగా సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, జడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్‌డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్‌రావు, జిల్లా నీటిపారుదల శాఖాధికారి ప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** గత ఫిబ్రవరిలో జరిగిన మున్సిపల్ ఎన్నికలోల మూడు నెలల్లో 70 శాతం పూర్తి చేయబడిన వంద పడకల ఆస్పత్రిని 70 శాతం పూర్తి చేయబడిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మూసివేసిన బస్సు డిపోను తెరిపిస్తానని, మిగిలిన సీసీ రోడ్లన్ని పూర్తి చేస్తానని భీమ్‌గల్ ప్రజలకు హామీనిచ్చి మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఇటు పక్కకు రాకుండా గడువు పూర్తయిన ప్రారంభించకుండా మాట తప్పిన పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌కు హెచ్చరిక జారీ చేస్తూ రేపు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు నిరాహార దీక్ష చేస్తున్న మ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా భీమ్‌గల్ వీడీసీ, యువజన, మహిళా, వ్యాపార సంఘాలు అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో వీడీసీలు కుల సంఘాలు, వ్యాపార సంఘ యువజన సంఘాలు, మహిళా సంఘాలు, పెద్ద ఎత్తున పాల్గొని ప్రశాంత్‌రెడ్డికి సంఘీభావం ప్రకటించాలని కోరారు. పర్స నవీన్, సిద్ధపల్లి రాములు, డిష్ గంగాధర్, రాంచందర్‌గౌడ్, బచ్చగోని శ్రీనివాస్, రాగి రాజు, చింత లూరి అవినాష్, పోతునూరు శ్రీనివాస్, వేముల శంకర్, కొట్టూరి దీపక్ పాల్గొన్నారు.

## ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్యనందించాలి

### సానుకూలంగా స్పందించిన జిల్లా విద్యాధికారి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అర్హులైన జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత విద్యనందించాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పంచరెడ్డి శ్రీకాంత్, వాగ్మారే సుభాష్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారండీఈఓ అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జిల్లాకు విచ్చేసిన విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా కు ఉచిత విద్యనందించాలని ప్రెస్‌క్లబ్ కార్యవర్గం కలిసి విన్నవించారు. ఈ వినతిపై స్పందించిన ఆమె జిల్లా విద్యాధికారికి ఆదేశించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఆధ్వర్యంలో కలిసి ఉచిత విద్యా అందించాలని విన్నవించారు. ఈ సందర్భంగా డీఈఓ స్పందిస్తూ ఒకటి రెండు రోజుల్లో జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందేలా ప్రొసీడింగ్ కాపీ అందజేస్తామని, ఇతర జిల్లాలోని ప్రోసీడింగ్‌ను పరిశీలించి జిల్లాలో కూడా ఉచిత విద్య అందేలా చర్యలు చేపడుతామని హామీనిచ్చారు.

# ఓటరు జాబితా సవరణపై అవగాహన

**ప్రజాపక్షం / జన్నారం :** జన్నారం మండల తహసీల్దార్ బక్కయ్య శుక్రవారం పొనకల్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 281, 276, 278, 282, 284లను సందర్శించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హ ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారంను జులై 18 లోపు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్లకు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఫారాలు సమర్పించని పక్షంలో ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే అవకాశం ఉందని, దీంతో ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకటేష్, ఉప సర్పంచ్ అప్పల జలపతి, మోహిన్, ప్రేమ, వార్డు సభ్యులు, బూత్ లెవల్ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

**ప్రజాపక్షం / జన్నారం :** గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ సచివాలయం ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన జన్నారం మండల మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు జాడి గంగాధర్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను విడుదల చేయకపోవడం దురదృష్టకరమన్నారు. బిల్లులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాజీ సర్పంచుల్లో పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులకు ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేసి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిరసనకు సిద్ధమైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో గోపాల్, తిరుపతి, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే రేఖ శ్యామ్ నాయక్‌కు పరామర్శ

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీర రేఖా శ్యాంనాయక్ కు ఇటీవల కాలి మడమకు సర్జరీ కావడంతో ఆ విషయం తెలుసుకున్న టిపిసిసి కార్యదర్శి అదిత,అంతకుముందు బహుత్ మాజీ ఎమ్మెల్యే బాబురావు పరామర్శించారు. రేఖ శ్యాం నాయక్ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం మెరుగు పడే వరకు జాగ్రత్తగా ఉండాలని వారు మాజీ ఎమ్మెల్యేకు సూచించారు. అనంతరం రేఖ శ్యామ్ నాయక్ దంపతులను శాలువాతో సత్కరించారు.వారి వెంట ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్,ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా,రాజేశ్వర్ రెడ్డి,ప్రసాద్,లచ్చన్న,సత్తన్న, విజయ్,రాజన్నయ్య,తదితరులు ఉన్నారు.

# విద్యుత్ లైన్‌మెన్‌కు గాయాలు

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మండలం పాత తర్లపాడ్ గ్రామంలో విద్యుత్ విధుల్లో చెట్టు కొమ్మలు విద్యుత్ స్థంభానికి సంబంధించిన వైర్ సరిచేస్తుండగా చెట్టు పై నుంచి కింద పడి జూనియర్ లైన్మెన్ తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది.మండలంలోని పాత తర్లపాడ్ విద్యుత్ శాఖ జూనియర్ లైన్మెన్ ఎల్లాబాయి విధి నిర్వహణలో భాగంగా రైతులతో విద్యుత్తు లైను తోటలలోకి వెళ్లే లైను సరి చేయిస్తుండగా అతను చెట్టు ఎక్కి పనిచేస్తుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమై చెవుల నుంచి రక్తస్రావం అయ్యింది. ఎడమ కాలు విరిగింది. స్థానికులు గమనించి వెంటనే 108 కు సమాచారం ఇవ్వడంతో. ఘటనాస్థలికి చేరుకున్న 108 సిబ్బంది కృష్ణ, పైలట్ అజర్ హుస్సేన్ క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తోటి విద్యుత్ సిబ్బంది కరీంనగర్లో ఆసుపత్రికి తరలించారు.

# కంటి పరీక్షలు

**ప్రజాపక్షం/బాల్కొండ :** మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలోని లయన్స్ భవనంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో మోతిబిందు ఉన్న వారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకు లింగం, జోనల్ చైర్మన్ జ్ఞానసాగర్‌రెడ్డి, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, సీనియర్ సభ్యులు కిషన్, జీవన్ పాల్గొన్నారు.



# పిఆర్‌సి ప్రకటించి డిఏలు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

### జిల్లా శాఖ అధ్యక్షుడు నల్ల కిషన్‌రెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పీఆర్‌సీ ప్రకటించి డిఏలు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తపస్ జిల్లా ధర్నాచౌక్ జిల్లా శాఖ అధ్యక్షులు నల్ల కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లాలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, పీఆర్‌సీ, 6 డిఏలు, పెండింగ్ బిల్స్ పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో ప్రభుత్వం హామీనిచ్చిన మేరకు సమస్యల న్యాయపరమైన సమస్యలు పరిష్కారం కోసం ఉద్యమం చేయక తప్పని పరిస్థితి ఉందని పీఆర్‌సీ రిపోర్టు వెంటనే తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్ ప్రకటన చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించి ఈ కుబేర్‌లో పేరుకుపోయిన పెన్షనర్స్‌తో సహా అందరికి పెండింగ్ బిల్లులను పూర్తిగా చెల్లించాలి. భవిష్యత్తులో ఏ బిల్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని, 6 డిఏల ప్రకటన విషయంలో గానీ కదలిక లేదని, ఒక్కొక్క ఉద్యోగి ఉపాధ్యాయులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. డిఏలు వెంటనే ప్రకటించాలని పెన్షనర్స్ బెనిఫిట్స్ కోసం ఎదురుచూస్తున్నాని, జాప్యం చేయకుండా వారివి క్లియర్ చేయించాలన్నారు. కేజీబీవీ, ఎస్‌ఎస్‌ఏ మహిళా ఉపాధ్యాయుల, సిబ్బంది సమ్మె కాలపు జీతం చెల్లిస్తూ, ఎంటీఎస్‌ను అమలు చేయాలని, మోడల్ స్కూల్ 010 పద్దు విషయంలో సత్వరం నిర్ణయం తీసుకోవలి ప్రభుత్వం తీసుకొచ్చిన 190 జిఓ అమలు మిగతా డిపార్ట్‌మెంట్ పూర్తి చేసిన విద్యాశాఖ ఇంకా కూడా పెండింగ్‌లో పెట్టింది. అప్పీల్ చేసుకున్న అందరికి ఉత్తర్వులు ఇవ్వాలని సిఎం ఇచ్చిన హామీ మేరకు 2003 డీఎస్సీ వారికి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టులో ప్రభుత్వం ఎస్‌ఎల్‌పి వెనక్కి తీసుకోవాలని, మెనిఫెస్టో ఉన్నా సీపీఎస్ రద్దు అంశంను పరిష్కారం కోసం ప్రత్యేకంగా చొరవ చూపి, అందరికి పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. అన్ని రకాల గురుకుల ఆశ్రమ, ఎయిడెడ్ పాఠశాలల సమస్యలతో పాటు అక్కడ పని చేసే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక కమిటీని నియమించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. సమస్యల పరిష్కారంలో చొరవ చూపకపోతే ఆగస్టు 1న రాష్ట్రవ్యాప్త మహాధర్నాలో అధ్యక్షులు నల్ల కిషన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డింగరి మధుసూదనాచారి, సుదర్శన్, జిల్లా ప్రధాన బాధ్యులు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.




# అరుదైన వ్యాధికి యశోదలో ఆధునిక చికిత్స

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అరుదైన వ్యాధికి యశోధ లో ఆధునిక చికిత్స అందించామని, థ్రోంబోటిక్ థ్రోంబోసటో పెనిక్ పర్పురా అనేది అరుదైన ప్రాణాంతకమైన మెడికల్ ఎమర్జెన్సీ అని సోమాజిగూడ యశోధ హాస్పిటల్ కన్సల్టెంట్ క్లినికల్ హిమటాలజిస్ట్, బిఎంటి ఫిజిషియల్, డాక్టర్ జి.విక్రమ్‌కుమార్ అన్నారు. మంగళవారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ మాట్లాడారు. నిజామాబాద్‌కు చెందిన ఒక గర్భిణీ థ్రోంబోటిక్ థ్రోం బోసైటోపెనిక్ పర్పురా (టీటీపీ) అనే అరుదైన ప్రాణాంతక రక్త సంబంధిత వ్యాధితో బాధపడగా, రోగి అత్యంత విషమ పరిస్థితిలో సోమాజిగూడలోని యశోధ హాస్పిటల్‌కు చికిత్స కోసం వచ్చారని, ఆస్పత్రిలోని మల్టీడీసీప్లినరీ బృందం వేగంగా స్పందించి వ్యాధిని నిర్ధారించిందన్నారు. తక్షణమే అత్యవసర చికిత్సను అందించి తల్లి గర్భస్త శిశువు ఇద్దరికి ఎలాంటి ప్రాణాపాయం లేకుండా భద్రత కల్పించారు. హెమటాలజి బృందం వెంటనే వ్యాధిని నిర్ధారించి టీటీపీకి అంతర్జాతీయంగా ఆమోదించబడిన అత్యుత్తమ చికిత్స అయిన థెరప్యూటిక్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ (ప్లాస్మా ఫెరిసిస్)ను కార్డికోస్టెరా యిడ్ థెరపీతో కలిపి వెంటనే ప్రారంభించింది. పేషెంట్ ఈ చికిత్సకు అద్భుతంగా స్పందించారు. ఆమె ప్లేట్‌లెట్ కౌంట్ వేగంగా కోలుకుంది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. చికిత్స చేయకపోతే ఇది చాలా వేగంగా తీవ్రమవుతుందన్నారు. గర్భధారణ సమయంలో తల్లి, బిడ్డ ఇద్దరిని రక్షించడానికి, ప్రాణాపాయం నుండి కాపాడటానికి, వ్యాధిని ముందుగా గుర్తించటం, వేగంగా నిర్ధారించటం తక్షణం థెరప్యూటిక్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ ప్రారంభించటం చాలా ముఖ్యమన్నారు. సకాలంలో నిపుణుల జోక్యం, సమన్వయంతో కూడిన మల్టీ డిసిప్లినరీ కేర్ విజయవంతమైన ఫలితాలను సాధించటంలో ఎంత ముఖ్యమో ఈ కేసు స్పష్టం చేస్తుందన్నారు. టీటీపీ అనేది ఒక అరుదైన రక్తసంబంధ వ్యాధి ఇందులో శరీరం అంతటా చిన్నచిన్న రక్తపు గడ్డలు ఏర్పడతాయన్నారు. ఈ వ్యాధిని త్వరగా గుర్తించటం మరింత కీలకమన్నారు. అత్యంత విషమ పరిస్థితిలో ఉన్న రోగులకు సకాలంలో ఆధారాలతో కూడిన చికిత్సనందిస్తూ తల్లులు వారి శిశువులకు సాధ్యమైనంత ఉత్తమమైన ఫలితాలను అందించటానికి ఆస్పత్రి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందన్నారు. యశోధ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గత మూడు దశాబ్ధాలుగా వైవిధ్యమైన వైద్య అవసరాలు కలిగిన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందిస్తోందన్నారు. హైదరాబాద్‌లోని యశోధ హాస్పిటల్ సోమాజిగూడ, సికింద్రాబాద్, మలకేట్, హైటెక్ సిటీలలో 4 స్వతంత్ర ఆస్పత్రులు ఉన్నాయన్నారు.




# సంక్షేమ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లు అనేక సమస్యలతో కొనసాగుతున్నాయని వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటి ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థి నాయకులను అరెస్ట్ చేసి సిటి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కి తరలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ సంక్షేమ రంగానికి న్యాయం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. సంక్షేమ హాస్టళ్లలో 5 స్టార్ తరహాలో భోజనం అందిస్తామని హామలు ఇచ్చి అమలుకు నోచుకోలేదని అన్నారు. కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కరీంనగర్ లోని అ ఏక సంక్షేమ హాస్టల్లు అద్దె భవనాల్లో వసతులు లేకుండా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ లో నూతన కళాశాల హాస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా విద్యార్థుల కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్, జిల్లాసహాయ కార్యదర్శి బోగేశ్వర్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం, సురేశ్, రోహిత్, నరేశ్, గర్ల్స్ కన్వీనర్ మానస, నాయకులు జాన్సన్, సిద్ధు, రాహుల్ , రిషి, అభి, అర్వాన్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

# పారాక్వాట్ నిషేధం దిశగా కేంద్రం కీలక నిర్ణయం

### రైతుల ప్రాణాలు కాపాడే చారిత్రక అడుగు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** మానవులు, జంతువుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారిన పారా క్వాట్ డైక్లోరైడ్ కలుపు నివాణర మందుపై కేంద్ర ప్రభుత్వం పూర్తి నిషేదం విధించే దిశగా తీసుకున్న నిర్ణయాన్ని ఆసుపత్రి చైర్మన్ డా.మర్రి మహేశ్వర్ రెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ అధికారిగా గెజిట్‌లో ముసాయిదా ఉత్తర్వులను విడుదల చేయడం రైతుల ప్రాణాల రక్షణకు చారిత్రక అడుగని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా క్వాట్ డైక్లోరైడ్ అత్యంత ప్రమాదకరమైన రసాయమని దీనికి ప్రత్యేక విరుగుడు లేకపోవడం వల్ల విష ప్రయోగాలకు గురైన వారిలో మరణాల శాతం అధికంగా ఉంటోందని తెలిపారు. ఈ ప్రమాదకర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని గత కొన్నేళ్లుగా రాష్ట్రంలోని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి పారా క్వాట్‌పై నిషేదం విధించాలని వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. అలాగే కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి దేశవ్యాప్తంగా ఈ రసాయనాన్ని నిషేదించాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. వైద్యులు, రైతు సంఘాలు, ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థలు చేసిన నిరంతర కృషిని పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ నివేదిక, రిజిస్ట్రేషన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. తుది ఉత్తర్వులు అమల్లోకి వచ్చిన తర్వాత పారా క్వాట్ డైక్లోరైడ్ దిగుమతి, తయారీ, రవాణా, పంపిణీ, విక్రయం, వినియోగం పూర్తిగా నిషేదించబడనున్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్లు కూడా రద్దు కావడంతో ఈ ప్రమాదకర రసాయనం వినియోగానికి పూర్తిగా తెరపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా పారా క్వాట్ డైక్లోరైడ్ నిషేదాన్ని కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన అమలు చేసి రైతుల, వ్యవసాయ కార్మికుల, ప్రజల ప్రాణాలు కాపాడే దిశగా మరిన్ని చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# రాష్ట్రస్థాయి పోటీల్లో బ్లూబెల్స్ విద్యార్థుల హవా

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** కరీంనగర్ హనుమాన్‌నగర్ లోని బ్లూబెల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. జూలై 12న హైదరాబాద్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి లెవె3 ఎస్ఐపి అబాకస్ పోటీల్లో 6వ తరగతి విద్యార్థిని కె.విహారి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం, 8వ తరగతి విద్యార్థిని కె.వినూత్న తృతీయ స్థానం సాధించారని పాఠశాల ప్రిన్సిపల్ జంగ సునీత మనోహర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలను ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్‌లో ఇలాంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన అబాకస్ శిక్షకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు.



# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పెరిగేలా అవగాహన

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

**ప్రజాపక్షం / గంగాధర :** నూతనంగా గంగాధరలో ఏర్పాటైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పెరిగేలా సమీప గ్రామాల్లో డప్పు చాటింపు ద్వారా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. గంగాధరలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంగాధరకు ప్రభుత్వ నూతన డిగ్రీ కళాశాల మంజూరవగా ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలోనే డిగ్రీ విద్యార్థులకు తరగతులు బోధించమన్నారు. ఈ నేపథ్యంలో భవనంలో అవసరమైన ఏర్పాట్లు వారం రోజుల్లోగా చేయాలని సూచించారు. మరమ్మత్తులు చేయించి డిగ్రీ విద్యార్థులకు అవసరమైన కంప్యూటర్ ల్యాబ్ తదితర సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పెరిగేలా చూడాలని అధ్యాపకులకు సూచించారు. డ్రాపౌట్స్ ఉండకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నాణ్యమైన విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి బోధన చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా భపనంలో కలియ తిరుగుతూ గదులు పరిశీలించారు. భవనానికి ప్రహారి అవసరమైన సౌకర్యాలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు. పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం గంగాధర మధురానగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.తహసీల్దార్ అంబటి రజిత, ఎంపిడివో దమ్మని రాము, ఎస్సారార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, సర్పంచ్ వేముల భాస్కర్, ఇంటర్ విద్యాధికారి వి.ఆంజనేయరావు, కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.



# సిఇఐఆర్ పోర్టల్ ద్వారా 31 మొబైల్స్ అందజేసిన పోలీసులు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ :** సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసిన సుమారు రూ.12 లక్షల విలువైన 31 మొబైల్ ఫోన్‌లను వాటి యజమానులకు మంగళవారం కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు ఏసీపీ వెకటస్వామి చేతులమీదుగా అప్పగించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకట స్వామి మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సిఈఆర్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకుంటే ఫోన్లను గుర్తించి తిరిగి అప్పగించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు.

ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించడంలో కృషి చేసిన వన్ టౌన్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ రాంచందర్ రావు, పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ఏసీపీ అభినందించారు.

## పల్లగుట్టను కొల్లగొడుతున్న వారిపై చర్యలు తీసుకోండి

సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు

ప్రజాపక్షం /ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలో సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు మాట్లాడుతూ నామాపూర్ గ్రామ శివారులో పల్లగుట్టకు మట్టి తవ్వకాలు చేపడుతూ ప్రభుత్వభూమి ఆక్రమణకు గురి చేస్తున్నారు. గుట్ట ఆక్రమణ గురవుతుండడంతో అటవీ జంతువులకు నిలువ నీడ లేకుండా పోతుంది. మన సహజ వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అన్నారు. పల్లగుట్టను కొల్లగొడుతున్న వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలి. పల్లగుట్ట హద్దులు నిర్ణయించి భూ ఆక్రమణ దారుల నుండి రక్షించాలి, తెలిపారు. లేకుంటే ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు అన వేణి బాబన్న , ఈర వేణి శంకర్, అనవేని రాజేందర్ పాల్గొన్నారు.

## సిడబ్ల్యుసి గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) గోదాం నిర్మాణానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్థల పరిశీలన చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద జిల్లా ఇందిరా మహిళా శక్తి భవనం సమీపంలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) గోదాం నిర్మాణానికి మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సీడబ్ల్యూసీ ఆర్ఎం విష్ణువర్ధన్, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎన్ని ఎకరాల స్థలం అందుబాటులో ఉందో ఆరా తీశారు. ఎన్ని ఎకరాల్లో ఎన్ని టన్నుల సామర్థ్యంతో నిర్మిస్తారని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, సీడబ్ల్యూసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మా రక్తం తీసుకో.. రైతన్నకు నీళ్లివ్వు!

సిఎం రేవంత్‌రెడ్డిపై చల్మెడ లక్ష్మీ నరసింహారావు ధ్వజం

ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మా రక్తం తీసుకొని నీ రక్తదాహం తీర్చుకో.. కానీ కండ్ల ముందర పంటలు ఎండిపోయి కన్నీళ్లు పెడుతున్న రైతాంగాన్ని సాగునీరిచ్చి తక్షణమే ఆదుకో అని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలో వినూత్నంగా 'రేవంత్‌రెడ్డికి రక్తదానం' పేరిట బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. చల్మెడ లక్ష్మీ నరసింహారావు స్వయంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీ నరసింహారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పదవి దక్కించుకోవాలనే ఏకైక తాపత్రయంతోనే ఆది శ్రీనివాస్ తన స్థాయిని మరిచి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అధికార పక్షం కక్షసాధింపు రాజకీయాలు పక్కనబెట్టి, ఎండిపోతున్న పంటలను కాపాడటంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

# భాష విద్యార్థికి సులభంగా అర్థం కావాలి

కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : తరగతి గదిలోని ప్రతి విద్యార్థికి సులభంగా అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు భాషను బోధించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ లో భాగంగా ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ శిక్షణ ఇస్తుండగా, మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి కూర్చుని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విన్నారు. ప్రతి సారి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల స్థానంలో కూర్చుని పాఠాలు వినడం, వారి అనుభవాలను, శిక్షణ ప్రక్రియపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గీతా నగర్ సిరిసిల్ల, ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు శిక్షణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేములవాడ, ప్రాథమిక స్థాయి ఎంఆర్ పీలకు తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ అంశాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేటలో శిక్షణ కొనసాగుతున్నది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయులకు అందించే ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ ఎంతో మేలు చేకూరుస్తుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశం రోజు వారి బోధనలో ఉపయోగించాలని సూచించారు. విద్యార్థి కేంద్రీకృత, వివిధ రంగులు ఉపయోగిస్తూ.. కృత్యాధార బోధన చేయాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్, హిందీ పదాలు సులభంగా నేర్చుకునేలా బోధించాలని ఆదేశించారు. రోజు వారి జీవితంలో భాగంగా వినియోగించే పదాలు, అంకెలు, పండ్లు, ఇతర విషయాలు సులభంగా నేర్చుకునేలా బోధించాలని తెలిపారు. బోధనలో టీఎల్ఎంలు వినియోగించి.. విద్యార్థులు ఆసక్తితో ఒడికి వచ్చేలా వివరించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్, మ్యాథ్స్ ఇతర అంశాల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు మెరుగు అయ్యేలా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులందరూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో అమలు చేయాలని, మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసీల్దార్ మహేష్, విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ఎంతో కీలకమైంది

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ప్రతి మనిషికి ఓటు హక్కు ఎంతో కీలకమైందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అన్నారు. సిరిసిల్ల పట్టణ కేంద్రంలో 6,7 వార్డులలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సర్ హెల్ప్ డెస్క్ లను మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడారు. బూత్ లెవెల్ అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 18వ తారీకు లోపు సరైన సమాచారం అందించి, ఓటర్ జాబితాలో తమ వివరాలు తప్పులు లేకుండా సరిగ్గా ఉన్నాయో లేదో స్వయంగా సరిచూసుకోవాలని సూచించారు. సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు మాట్లాడుతూ ఓటర్లకు అవగాహన కల్పించేందుకు మరియు నమోదు ప్రక్రియలో సహాయం చేయడానికి సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద హెల్ప్ డెస్క్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాగుల జగన్, సర్ సూపర్వైజర్స్ సబ్బని వేణు, బొప్ప దేవయ్య, కంసాల మల్లేశం అలవాల సత్యనారాయణ పాల్గొన్నారు.

# నిందితులకు శిక్షలు పడేలా కృషి

జిల్లా ఎస్పి మహేష్ బి. గీతే

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: ప్రతి కేసులో దర్యాప్తును వేగవంతం చేసి, శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన విచారణ చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా ప్రతి అధికారి కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సిరిసిల్ల సబ్ డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, నాన్–బెయిలబుల్ వారెంట్ల అమలు, శాంతిభద్రతల నిర్వహణ, పోలీసు సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో శాస్త్రీయ,సాంకేతిక ఆధారాలు,ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ ఎవిడెన్స్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ నేరాలను వేగంగా ఛేదించి బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు.డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వర రావు, వెంకటేష్, మొగిలి, మధుకర్, ఆర్ఐ సురేష్, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

తెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కమిటీ

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : విద్యారంగ సమస్యల పరిష్కారం, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రోజున నిర్వహించ తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి వెళ్తున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులను రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా అర్ధరాత్రి నుంచే అక్రమంగా గృహనిర్బంధాలు చేయడం, అరెస్టులు చేయడాన్ని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టిపిఎఫ్) పెద్దపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శి గాండ్ల మల్లేశం తీవ్రంగా ఖండించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగబద్ధమైన హక్కును హరించడం సరైన విధానం కాదు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కాక వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## ఉత్తమ పాత్రికేయ అవార్డు గ్రహీత భాశెట్టి హరీష్‌కు ఘన సన్మానం

ప్రజాపక్షం /మెట్‌పల్లి : ఇటీవల శ్రీకాళహస్తిలో ఉత్తమ పాత్రికేయ అవార్డు అందుకున్న జగిత్యాల జిల్లా ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు భాశెట్టి హరీష్ను మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు తన కార్యవర్గ సభ్యులతో కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మైలారపు రాంబాబు మాట్లాడుతూ, ప్రజలకు–ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పాత్రికేయుల్లో భాశెట్టి హరీష్ ఒకరని కొనియాడారు. ఆర్యవైశ్య సమాజానికి చెందిన వ్యక్తి జగిత్యాల జిల్లా ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడిగా సేవలందిస్తూ ఉత్తమ పాత్రికేయ అవార్డు అందుకోవడం గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు అందుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్మి రవికుమార్, వాసవి దేవాలయ అధ్యక్షుడు చాద సురేష్, వాసవి గార్డెన్ అధ్యక్షుడు కోట కిరణ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుల్లూరి నవీన్ కుమార్, చైతన్యనగర్ వాడకట్టు 2 అధ్యక్షుడు బండారి గోపీకృష్ణ, జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు సామ అమర్ తదితరులు పాల్గొని భాశెట్టి హరీష్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సిఎంపై కేసు నమోదు చేయాలని బిఆర్ఎస్ ఫిర్యాదు

కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ పోలీస్ స్టేషన్లలో వినతి

ప్రజాపక్షం /మెట్‌పల్లి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రత్యర్థులు, రైతులను ఉద్దేశించి హింసను ప్రేరేపించేలా, ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించేలా ఉన్నాయని ఆరోపిస్తూ, ఆయనపై భారతీయ న్యాయ సంహిత (BNS), 2023లోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ పోలీస్ స్టేషన్లలో పోలీసు అధికారులకు లిఖితపూర్వక ఫిర్యాదులు సమర్పించారు.ఇటువంటి వ్యాఖ్యల వల్ల సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసిన వారు, తమ ఫిర్యాదుపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి భారతీయ న్యాయ సంహిత (BNS), 2023లోని సంబంధిత నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులు స్వీకరించి,చట్ట ప్రకారం పరిశీలిస్తామని తెలిపారు.

## ఘనంగా మహారాజ్ అమావాస్య వేడుకలు

ప్రజాపక్షం /మెట్‌పల్లి : మహారాజ్ అమావాస్య సందర్భంగా మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహారాజ్‌కు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.అనంతరం భక్తుల కోసం సామూహిక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని మహారాజ్ ఆశీస్సులు పొందారు. అనంతరం సామూహిక అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు మాట్లాడుతూ, సమాజ ఐక్యత, సేవాభావాన్ని పెంపొందించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం మహారాజ్ అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

## తాగునీటి శుద్ధి కేంద్రాలలో తనిఖీ

ప్రజాపక్షం /ముస్తాబాద్ : ముస్తాబాద్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తాగునీటి శుద్ధి కేంద్రాలను మండల పంచాయతీ అధికారి ఎం పి ఓ అబ్దుల్ వాజిద్, ఏ ఈ సతీష్ జిల్లా కలెక్టర్ ఆదేశముల ప్రకారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాటర్ ప్లాంట్ల పనితీరు, నీటి శుద్ధి ప్రక్రియ, పరిశుభ్రత, ఫిల్టర్ల నిర్వహణ, నీటి నాణ్యత, వినియోగదారులకు సురక్షితమైన తాగునీరు అందుతున్న విధానాన్ని పరిశీలించారు. ప్లాంట్ల నిర్వాహకులకు యంత్రాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని నోటీసులు ద్వారా సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.